నిర్లక్ష్యం నీడన తాగునీటి కోనేరు

- నిర్వహణ లేక తీవ్ర దుర్గంధం
- పిచ్చి మొక్కలు, చెత్త పెరిగిపోవడంతో అధ్వాన పరిస్థితులు
- గాంధీనగరంలో తాండవ నిర్వాసితుల అవస్థలు


అధ్వానంగా దర్శనమిస్తున్న గాంధీనగరంలో కోనేరు

నాతవరం: తాండవ నిర్వాసితులు గ్రామమైన గాంధీనగరంలో ఏర్పాటు చేసిన తాగునీటి కోనేరు అధికారుల నిర్లక్ష్యంతో కంపు కొడుతోంది. మండలంలో తాండవ రిజర్వాయరు నిర్మాణ సమయంలో ప్రాజెక్టు లోపల ఉన్న గ్రామాలతో పాటు వ్యవసాయ భూములను అప్పటి ప్రభుత్వం ఖాళీ చేయించింది. భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ అప్పటి నర్సీపట్నం సబ్ కలెక్టరుగా(1974) పని చేస్తున్న కాకి మాధవరావు మండలంలో రెండు చోట్ల నివాస స్థలాలు కేటాయించారు. అందులో ఒకటి మాధవనగరం కాగా.. రెండోది గాంధీనగరం గ్రామాలుగా నామకరణం చేసుకున్నారు. తుని-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో గాంధీనగరం వాసులకు స్థలాలు, వ్యవసాయ భూములు సమకూర్చారు. తాండవ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇల్లు కోల్పోయిన వారికి స్థలంతో పాటు ఒక ఎకరం భూమి ఇచ్చారు. ఇల్లు, వ్యవసాయ భూములు కోల్పోయిన వారికి ఇంటి స్థలంతో పాటు రెండు ఎకరాలు వ్యవసాయ భూమి కేటాయించారు. వీటితో పాటు నిర్వాసితుల జీవనం సాగించేందుకు అప్పట్లో పశువులతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామం కావడంతో గాంధీనగరంలో ప్రజలకు, పశువులకు ఇతర అవసరాలు కోసం ప్రభుత్వం తాగునీటి కోనేరు తవ్వించి, నిత్యం నీరు ఉండేలా చర్యలు తీసుకుంది. గ్రామస్తులంతా మొదట్లో కోనేరు నీటిపై ఆధారపడి జీవనం సాగించేవారు. గత కొంత కాలంగా అధికారులు కోనేరు నిర్వహణ చేయకుండా గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం కోనేరులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. మొక్కలు చెత్త ఉండడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. కోనేరు నిర్వహణ లేక నీరంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పర్యవేక్షణ లేక కోనేరులో కొందరు చెత్తా చెదారం వేసేస్తుండడంతో అధ్వానంగా తయారైంది. మండు వేసవిలో సైతం ప్రజలు, పశువులు కోనేరులో నీరు తాగి జీవనం సాగించే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం గ్రామంలో తాగునీటి పథకాలు రావడంతో గత కొంత కాలంగా కోనేరు నీరు వాడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం మధ్యలో దుర్గంధం వెదజల్లుతున్న కోనేరును ఆధునికీకరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో యోగా శిక్షణ తరగతులు నేడు


కె.కోటపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాంబశివరావు

కె.కోటపాడు : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న విశాఖలో జరిగే యోగా కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ ముందుగా గ్రామస్థాయిలో యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. కె.కోటపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే యోగా శిక్షణ పొందిన వారు శనివారం ఆయా గ్రామాల్లో నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల మధ్యలో యోగా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఈవోఆర్డీ రమణి, పంచాయతీ కార్యదర్శులు సురేష్‌బాబు, శ్రీనివాస్, బి.సరోజిని, అనురాధ, ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ మిత్ర వెల్ఫేర్ సొసైటీ విస్తృత సేవలు


ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందిస్తున్న సమాజ మిత్ర సొసైటీ సభ్యులు

కె.కోటపాడు : గొండుపాలెంలో సమాజ మిత్ర వెల్ఫేర్ సొసైటీని యువకులతో కలిసి ఏర్పాటు చేసి అకాల మరణం చెందిన బండారు లక్ష్మణరావు జ్ఞాపకార్థం శుక్రవారం సొసైటీ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన జయంతి సందర్భంగా సొసైటీ సభ్యులు స్థానిక హైస్కూల్, దండుముత్యాలమ్మ ఆలయ పరిసరాల్లో 120 మొక్కలను నాటారు. కె.కోటపాడు 50 పడకల ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సాగునీటి సరఫరాకు చర్యలు


సాగునీటి కాలువలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

రోలుగుంట: కొవ్వూరు గ్రామంలోని పోతలవాని చెరువు నుంచి ఆయకట్టు రైతులకు సాగునీటి సరఫరా కోసం పంట కాలువ పనులు చేట్టారు. ఈ చెరువుకు ఉన్నటువంటి మదుము, పొర్లుకట్టు, మధ్య కాలువ, మదుమ కాలువ పనుల కోసం ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు మలసాల రమణాజి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఈశ్వరరావుకు ప్రతిపాదన తయారు చేసి అందజేశారు. ఈ మేరకు ఆయన ఈ చెరువు మదుముల నుంచి పంట కాలువ పనులను మంజూరు చేశారు. ఈ మేరకు పనుల కోసం 55 మందిని కేటాయించారు. గత నాలుగు రోజులుగా ఏపీవో పర్యవేక్షణలో ఈ పనులు జోరుగా సాగుతున్నాయి.

వెలుగు ఏపీఎంవోగా రమణికుమారి నియామకం

మాడుగుల రూరల్: మండల వెలుగు ఏపీఎంవోగా గొన్నాబత్తుల రమణికుమారి నియమితులయ్యారు. ఆమె అనకాపల్లి డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న అప్పలనర్సమ్మ కోటవురట్ల మండలానికి బదిలీ అయ్యారు. ఏపీఎంవో రమణికుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి, వారి ఆదాయ వనరులు పెంచేందుకు, మహిళా మార్ట్ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటానన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


యోగాంధ్రలో వివిధ పోటీల విజేతలు

కోటవురట్ల: గ్రామీణ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. యోగాంధ్రలో భాగంగా వివిధ పోటీలు నిర్వహించగా, జిల్లా స్థాయిలో కోటవురట్ల మండలానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. కొడవటిపూడి శ్రీచాణక్య స్కూల్‌కు చెందిన డి.ప్రియాంక క్విజ్ పోటీలో, యోగాంధ్ర స్కిట్‌లో బి.చాందిని, డి.ప్రియాంక, ఐ.జ్యోతి కారాణి, ఎస్.హారిక, ఎం.అపూర్వ, వ్యాసరచనలో జెడ్పీ హైస్కూల్, కొడవటిపూడికి చెందిన కె.రామలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం


సత్యవరంలో దమ్ము పట్టి సిద్ధం చేస్తున్న నారుమడి

మాడుగుల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అడపాదడపా చిరుజల్లులు పడడంతో రైతులు విత్తనాలు చల్లడానికి రైతులు సిద్ధమయ్యారు. రైతు సేవా కేంద్రాల నుంచి విత్తనాలు అందకపోయినా సరే ప్రైవేటు వ్యక్తుల దగ్గర వరి విత్తనాలు కొనుగోలు చేసి, నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో 12,500 ఎకరాలు భూమిలో వరినాట్లు వేయడానికి వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. సత్యవరం, జేడీపేట, జాలంపల్లి, పొన్నవోలు, తదితర గ్రామాల్లో వరి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అధికారుఉల స్పందించి వరి విత్తనాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

మాకవరపాలెం తహసీల్దార్‌గా వెంకటరమణ

మాకవరపాలెం: కొత్తగా నియమితులైన తహసీల్దార్ బి.వెంకటరమణ శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు నర్సీపట్నం తహసీల్దార్ రామారావు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఈ నేపథ్యంలో రావికమతంలో పనిచేస్తున్న వెంకటరమణను ఇక్కడికి బదిలీ చేయడంతో శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నకిలీ లింక్‌లతో అప్రమత్తం

కశింకోట: సైబర్ నేరాలకు కారణమయ్యే నకిలీ ఏపీకే ఫైళ్లతో సామాజిక మాధ్యమాల ద్వారా పంపే మెసేజ్‌ల పట్ల ప్రజలు, శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్‌బీఐ రివార్డ్స్ యాప్, ఇన్ కం టాక్స్ రిఫండ్ యాప్, ఎలక్ట్రిసిటీ బిల్ వేవర్ యాప్ తదితర వాటి ద్వారా నకిలీ ఫైళ్లు పంపుతారన్నారు. ఇవి అధికారిక అప్లికేషన్లు కావన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, కాంటాక్టులు, సెల్‌ఫోన్ డేటా వగైరా తెలుసుకొని దొంగిలించడానికి ఇవి ఉద్దేశించినవన్నారు. నకిలీ యాప్, ఫైళ్ల ద్వారా బ్యాంకు ఖాతాలు ఖాళీ కావచ్చునని, వ్యక్తిగత సమాచారంతోపాటు పోలీస్ శాఖ సమాచారం లీక్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఫోన్లు హ్యాక్ అవుతాయన్నారు. దీనిదృష్ట్యా అధికారులు, సిబ్బంది పలు ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి వినియోగించాలన్నారు. ఇటువంటి అనుమానాస్పద లింకులు వచ్చిన వెంటనే సైబర్ సెల్ లేదా ఐటీ వింగ్‌కు సమాచారం అందించాలని కోరారు.

నాతవరం ఏవో సుగుణ బాధ్యతల స్వీకరణ



నాతవరం: మండల వ్యవసాయాధికారి సుగుణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలో భాగంగా ఆమె నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో పని చేస్తూ ఇక్కడికి నియమించారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన వ్యవసాయాశాధికారి శైలజ నర్సీపట్నం ఏడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన సుగుణకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి


సిబ్బందికి సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి సుగుణ

నాతవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన వరి విత్తనాలు పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని నూతన వ్యవసాయాధికారి సుగుణ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించిన వెంటనే మండలంలో పని చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలోనే ఖరీఫ్ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో వరి పంట సాగవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి వరి విత్తనాలు రైతులకు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. రైతులు ప్రజాప్రతినిధుల పట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం మండల ఏఎస్‌వో ఉలబాల రాజుబాబుతో సమావేశమై మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటలు వివరాలు తదితర అంశాలపై చర్చించారు.

ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన సంబరాలు


కె.కోటపాడులో కేక్ కట్ చేస్తున్న మాజీ డీసీసీబీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి, అమ్మాజి

కె.కోటపాడు : ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో అన్ని రంగాల్లోనూ తన నిర్ణయాలతో దేశం ముందుండేలా చేశారని బీజేపీ మండల అధ్యక్షురాలు పైల అమ్మాజి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రధాని మోదీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కె.కోటపాడులో శుక్రవారం ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిసేలా మోదీ పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు సత్యనారాయణపాత్రుడు, ఇమంది సన్యాసిరావు, గజ్జి అప్పలనాయుడు, సబ్బవరపు శివ, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ


రావికమతం హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు


కె.జె.పురంలో పాఠ్య పుస్తకాలు అందిస్తున్న స్కూలు కమిటీ చైర్మన్ సంతోష్‌కుమార్

రావికమతం: మండల కేంద్రం రావికమతం హైస్కూల్‌లో శుక్రవారం సర్పంచ్ గెంజి మోదినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వేపాడ లక్ష్మి నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అప్పారావు విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం ఓరుగంటి శ్రీనివాసరావు, స్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, స్కూలు కమిటీ సభ్యులు కచ్చా శ్రీనివాసరావు, నాగసూరిప్పారావు, ముచ్చకర్ల శ్రీనివాసరావు, గంగాభవానీ, పరిమి లత, కర్రి వరలక్ష్మి, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీ ఏసీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 8 గంటలకు 'రక్తదాన శిబిరం' నిర్వహిస్తున్నట్లు సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు


అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామ ఇలవేల్పు అప్పికొండమ్మ అమ్మవారి ఘటాల ఊరేగింపు గురువారం రాత్రి ఘనంగా జరిగింది. అమ్మవారికి పూజలు అనంతరం 300 మంది వరకు మహిళలు ఘటాలు, జ్యోతులు వెలిగించి ఏఎల్‌పురం నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లోజల సుజాతతో పాటు మహిళలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పండగ సందర్భంగా గ్రామంలో భారీగా బాణసంచా కాల్చారు. విద్యుత్ దీపాల అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై విచారణ జరపాలి



ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో గురువారం జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సాల్వెంట్ వద్ద ఇండికేటర్‌ను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పరిశ్రమల్లో హెల్త్‌కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో భద్రత ఆడిట్‌ను నిర్వహించాలని, ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు గుమ్మాల సింహాచలం, ప్రసాద్, లోవరాజు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

వడ్డాది శ్మశానవాటికలో తీరిన నీటి కొరత


కొత్తగా ఏర్పాటు చేసిన ట్యాంకును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది సంతబయిలు శ్మశానవాటిక వద్ద నీటి సమస్య తీరింది. శ్మశానవాటిక వద్ద నీటి వసతి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గ్రామస్తులంతా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, ఆ పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీటీసీ నిధుల నుంచి మంజూరైన రూ.2 లక్షలతో శ్మశానవాటిక వద్ద మంచినీటి ట్యాంకు, కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ ప్రారంభించారు. వార్డు మెంబర్ బొబ్బరి ఈశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మనోహర్, పార్టీ నాయకులు చింతల శంకర్రావు, దొండా నాగేశ్వరరావు, బొబ్బరి నానాజీ, గండిబోని శ్రీను, ప్రగడ శ్రీను పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను నియమించాలి


కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీలోని జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నూకరాజు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు యూనియన్ నాయకులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు తగ్గట్టుగా కార్మికులు లేకపోవటం వల్ల ఉన్న కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. పారిశుధ్య కార్మికులకు డ్రైవర్ డ్యూటీలు వేయరాదన్నారు. మస్తర్ల రికార్డులోనే హాజరు నమోదు చేయాలన్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్‌కు కనీసం ముగ్గురు కార్మికులను కేటాయించాలన్నారు. వీధుల్లో చెత్తను సేకరించిన పుష్‌కార్టులు ట్రాక్టర్ వద్దకు వచ్చేలా చూడాలన్నారు. కార్మికులపై మేస్త్రీల బెదిరింపులు, దూషణలు అరికట్టాలన్నారు. నాణ్యమైన పరికరాలు పంపిణీ చేయాలన్నారు. ఈఎస్ఐ కార్డులు తక్షణమే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు వి.రమణ, అర్జమ్మ, రాజు, శ్రీను, లోవ, దేముడు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు


వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రావికమతం: కొత్తకోట గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు వేపా రామకృష్ణ కిషోర్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 19న అమ్మవారి నగర ఊరేగింపు, విఘ్నేశ్వర పూజ, చండీ హోమం, 20న 108 లీటర్ల పాలతో మహా క్షీరాభిషేకం, 21న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, 22న అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట నీలవేణి గోవిందరావు, కమిటీ సభ్యులు గర్రెడ్డి శ్రీను, శేషు, దివాకర్, వెల్లంకి నాయుడు, సత్యనారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు విత్తనమే కీలకం


రైతులకు అధిక దిగుబడి విత్తనం అందజేస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: ప్రతి పంటలోను అధిక దిగుబడులు సాధనకు నాణ్యమైన విత్తనమే కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్. ముకుందరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఖరీఫ్ విత్తన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనం ప్రాముఖ్యత, అధిక దిగుబడులునిచ్చే విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని కోరారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. డి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాత విత్తనాల మార్పిడి చేయడంలో తీసుకోవలసిన మెలకువలు ఆర్.జి.ఎల్ -2538 రకానికి ప్రత్యామ్నాయ రకాలు, జిల్లాలో వరి పండించే పరిస్థితులకు అనువైన నూతన వంగడాల గురించి వివరించారు. డాక్టర్ పి.వి. పద్మావతి విత్తన ఉత్పత్తి మెలకువలను వివరించారు. డాక్టర్ కె.వి రమణమూర్తి వరి సాగులో ఆధునిక పద్ధతులు, కలుపు యాజమాన్యం పద్ధతులను వివరించారు. డాక్టర్ సి.హెచ్ రామలక్ష్మి జీవన ఎరువుల ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. డాక్టర్ బి. భవాని మాట్లాడుతూ వరి సాగులో చేపట్టవలసిన ముందస్తు సస్యరక్షణ చర్యలను వివరించారు. సమన్వయకర్తగా డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. మూలపేట, వాడ్రాపల్లి, హరిపాలెం తిమ్మరాజుపేట, తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల నుంచి 40 మంది రైతులు హాజరయ్యారు.

త్వరలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీలు


ఎమ్మార్పీఎస్ సమావేశంలో యలకా మల్లిబాబు

అనకాపల్లి: త్వరలో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు తెలిపారు. స్థానిక శ్రీరామ్‌నగర్ ఎమ్మార్పీస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా పోరాటం చేయడం వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. విద్యతోనే మానవుని భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఇన్‌చార్జి వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరి మంగరాజా, సభ్యులు మారేడుపూడి ఈశ్వరరావు, శివ, జగదీష్, కొండలరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం నిధుల్లో కోత దారుణం

రూ.15 వేలు తల్లులకు జమ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



యలమంచిలిలో నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తల్లికి వందనం నిధుల్లో రూ.2 వేలు కోత పెట్టడాన్ని శుక్రవారం వారు ఆక్షేపించి, నిరసన తెలియజేశారు. ప్రభుత్వం నిబంధనల పేరుతో కొందరికి పథకాన్ని వర్తింపజేయకపోవడం దురదృష్టకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ అభిప్రాయపడ్డారు. 2024-25 విద్యా సంవత్సరానికి చెల్లించాల్సిన తల్లికి వందనం నిధులు వెంటనే తల్లుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆ నిధులను జమ చేయకుండా ఎగ్గొట్టడానికే ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నిబంధనల పేరుతో పలువురికి తల్లికి వందనం దూరం చేసే ఆలోచన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కే మణికంఠ, రూపసాయి, దినేష్ పాల్గొన్నారు.